## డ్రైనేజీ నీటిలో ఆయిల్ ఉండడంతో అదుపు తప్పి పడిపోతున్న వాహనదారులు

మలక్‌పేట, జూలై 10 ప్రభాతవార్త: డ్రైనేజీలో ఆయిల్ కలిసి ఉండి నీరు రోడ్లపై పారుతుండడంతో అదుపు తప్పి వాహనదారులు కిందపడిపోవడంతో పలువురికి గాయాలైన సంఘటన మలక్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మలక్‌పేట నల్గొండ చౌరస్తా ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీటిలో ఆయిల్ కలిసి పొంగి ప్రవహిస్తుండడంతో అటుగా ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోయారు. వారిలో కొంతమందికి గాయాలయ్యాయి. రహదారిపై డ్రైనేజీ నీరు ప్రవహిస్తుండడంతో చంచల్‌గూడనుండి చాదర్‌ఘాట్‌వైపు వెళ్లే దారిలో బైకులు అదుపు తప్పి పడిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు ఆ దారిని కొంతసేపు బారికేడ్లతో మూసివేసారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జిహెచ్ఎంసి అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దీంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.



అదుపు తప్పి పడిపోతున్న వాహనదారులు

హైదరాబాద్ వార్త



# ఆడంబరంగా అంబారీపై అమ్మవారి ఊరేగింపు

**పోతురాజుల విన్యాసాలు..** రంగం అనంతరం ఆలయాన్ని కడిగి శుద్ధి చేస్తారు.అనంతరం ఆలయం ముందు పోతురాజుల విన్యాసాలు భక్తులను ఎంతగానో అలరించాయి.వీర తాళ్లు చేతబట్టిన పోతురాజులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ భక్తులను ఉత్సాహ పరిచారు.అనంతరం అంబారీపై అమ్మ వారి చిత్ర పటాన్ని ఉంచి పురవీధులలో ఊరేగింపుగా తిప్పుతారు.





సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతర రెండవ రోజు కూడా అంగ రంగ వైభవంగా సాగింది. రెండవ రోజు ప్రధానంగా ఆలయంలో నిర్వహించే రంగం (భవిష్యవాణి) మాతంగి స్వర్ణలత అమ్మ వారి ఆలయానికి ఎదురుగా ఉన్న మాతంగేశ్వరి ఆలయం వద్ద పచ్చికుండపై నిల్చుని భవిష్యవాణి వినిపించారు.



**ఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతరకు రెండో రోజు పోటెత్తిన భక్తులు**

**రంగం వినేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జంట నగర వాసులు**

**కోలాహాలంగా పోతురాజుల విన్యాసాలు**

**కన్నుల పండువగా పుర వీధులలో అంబారీ పై అమ్మ వారి ఊరేగింపు తరలి వెళ్లిన ఘటం**

**ఆలయం వెలుపల అలరించిన నృత్యాలు**

**వైభవంగా ఫలహారం బండ్ల ఊరేగింపు**

బేగంపేట జులై 10, ప్రభాతవార్త : అంబారీ పై అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ ఆవరణ నుంచి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హారతి ఇచ్చి ప్రారంభించారు. సాయంత్రం ఫలహారం బండ్ల ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది.ఆదెయ్య నగర్ కమాన్ వద్ద నుంచి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫలహారం బండి రాగా వివిధ ప్రాంతాల నుంచి ఫలహారం బండ్లు పెద్ద సంఖ్యలో తరలి వచ్చాయి. జాతర సందర్భంగా ఆలయానికి వచ్చేందుకు ఏర్పాటు చేసిన క్యూలైన్ల లో రెండవ రోజు కూడా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారి ఆలయానికి తరలి వచ్చి అమ్మ వారిని దర్శనం చేసుకున్నారు.రంగం జరుగుతున్న సమయంలో కొద్దిసేపు భక్తులను ఆలయంలో నికి అనుమతించలేదు.రంగం కార్యక్రమం ముగిసిన వెంటనే అమ్మవారి దర్శనానికి భక్తులను యధావిధిగా అనుమతించారు. ఆషాడ బోనాల జాతరంటే రెండు రోజుల పాటు శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయం తో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల వద్ద కూడా జాతర సందడి నెలకొని ఉంటుంది.దీంతో ఈ ప్రాంతం అంతా ఆధ్మాత్మిక శోభతో నిండిపోతుంది.



నృత్యం చేస్తున్న మంత్రులు

**ఫలహార బండ్ల కోలాహాలం..** సాయంత్రం సమయంలో ఫలహార బండ్ల ఊరేగింపు కోలాహాలంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి అమ్మ వారికి ఫలహారాన్ని బండ్లలో తీసుకు వచ్చి అమ్మ వారి ఆలయానికి చేరుకుంటారు. ఈ ఫలహారం బండ్లను ఎంతో సుందరంగా తీర్చిదిద్ది డప్పు చప్పుళ్లతో అత్యంత కోలాహలంగా ఆలయానికి చేరుకుంటారు.పుర వీధులలో ఊరేగింపుగా వచ్చే సమయంలో యువతీ,యువకులు నృత్యాలు చేస్తూ ఫలహారం బండ్ల ఊరేగింపు తీస్తారు.వివిధ రకాలైన విద్యుత్ దీపాలను ఈ బండ్లకు ఏర్పాటు చేసుకుంటారు. సాయంత్రం 7గంటలకు ప్రారంభం అయ్యే ఈ వేడుకలు అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఫలహారం బండ్ల ఊరేగింపుతో ఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతర పూర్తయింది.

**అన్ని శాఖల అధికారులకు మంత్రి తలసాని అభినందనలు**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతర ను దిగ్విజయంగా పూర్తి చేయడంలో సహకరించిన పోలీస్,జీహెచ్ఎంసీ,వాటర్‌వర్క్స్, విద్యుత్,ఇలా జాతర సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చక్కటి సమన్వయంతో జాతర విజయ వంతం కావడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందనలు తెలియజేసారు. అన్ని శాఖల మద్య చక్కటి సమన్వయంతోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. లక్షలాదిగా దేశ,విదేశాలతో పాటు జంట నగరాల నుంచి లక్షలాదిగా భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారని,ఎక్కడా ఎవరికీ ఎలాంటి అవాంతరాలు ఎదురు కాకుండా అధికారులు సహకరించారని మంత్రి తలసాని అన్నారు.ఆదివారం రాత్రంతా కూడా దర్శనాలు జరిగాయన్నారు. అమ్మ వారు భవిష్యవాణి కార్యక్రమం బాగా జరిగిందని చెప్పడం సంతోషం అన్నారు.బోనాల జాతరను తెలంగాణా రాష్ట్ర పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని మంత్రి తలసాని చెప్పారు.ఆలయ ప్రాంగణంలో సేవలు అందించిన దక్కన్ మానవ సేవా సమితి,మక్తలాఫండేషన్,భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తదితర స్వచ్చంద సేవా సంస్థలు,అన్నదానం,అల్పాహారాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించిన స్వచ్చంద సేవా సంస్థల సేవలను సైతం మంత్రి తలసాని ప్రత్యేకంగా అభినందించారు.

## బహుమతులు ఇవ్వాలనుకుంటే.. చేనేత వస్త్రాలను ఇవ్వండి

**గవర్నర్ తమిళసై సౌందరరాజన్**



చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ తమిళసై తదితరులు

హైదరాబాద్, జులై 10,ప్రభాతవార్త: చేనేత కళాకారులను ప్రోత్సహించాలని అందుకు తమవారికి ఎవరైనా బహుమతులు ఇవ్వాలి అనుకుంటే చేనేత వస్త్రాలను ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెలా మొదటివారం ఖచ్చితంగా చేనేత వస్త్రాలు ధరిస్తే చేనేత కళాకారులను మరింత గుర్తింపునకు ఇచ్చిన వారమవుతామని గవర్నర్ తమిళసై సౌందరరాజన్ అన్నారు. సోమవారం సాయంత్రం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన ఇండియన్ సిల్క్ గ్యాలరీని ప్రారంభించి సందర్శించారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ చేనేత కళాకారులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందన్నారు. ఇక్కడి చీరలు ఆకర్షణీయంగా ఉన్నాయని విద్యార్థులకు కూడా నెలలో ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించాలని సూచించారు. నాగర్వం నావస్త్రాలు అనేలా మన సాంప్రదాయ వస్త్రాలను ప్రోత్సహించాలని కోరారు. అలాగే ఎగ్జిబిషన్‌లో చేనేత వస్త్రాలను తయారు చేసే మగ్గాలను ఆమె పరిశీలించారు. చేనేత కళాకారులను ఇక్కడికి నేరుగా తీసుకువచ్చి వారిని ప్రోత్సహిస్తున్న నిర్వాహకులు శ్రీనివాస్‌రావు, వినయ్‌కుమార్‌లను అభినందించారు. తమిళంలో వస్త్రాలపై ఉన్న ఆల్ కాది ఆర్ట్ కాల్ అనే సందేశాన్ని తెలిపారు. ఈకార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఎన్ఫోర్స్‌మెంట్ ప్రతినిధి అరుణ్‌కుమార్, డాక్టర్ సుధావాణి తదితరులు పాల్గొన్నారు.

## అన్నం పెట్టిన ఇంటికే కన్నం

**రూ.21లక్షలు విలువ చేసే ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం**



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సందీప్‌రావు

పేట్‌బషీరాబాద్, జూలై 10 ప్రభాతవార్త: మద్యానికి బానిసై జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో అన్నం పెట్టిన యజమాని ఇంటినే లూఠీ చేసిన ఇద్దరు నిందితులను దుండిగల్ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సోమవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ సందీప్‌రావు నిందితల వివరాలు వెల్లడించారు. నిందితుడు నితేష్‌కుమార్(22) ముఖేష్‌కుమార్ అనే వ్యక్తి వద్ద మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తుండగా, నితేష్‌కుమార్ బంధువైన రెండవ నిందితుడు కమలేష్(22) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. వీరిద్దరు మద్యానికి, జల్సాలకు బానిసలై సులువుగా డబ్బు సంపాదించాలని నితేష్‌కుమార్ తాను పని చేస్తున్న యజమాని ముఖేష్ ఇంటిని దోచుకోవడానికి నిందితులిద్దరు పథకం రచించుకున్నారు. అయితే గత 26న ముఖేష్ పని నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లడం గమనించిన నిందితులిద్దరు తాళం పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు దోచుకెళ్ళారు. ఈ సంఘటనపై యజమానికి ముఖేష్ దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తుండగా సోమవారం బహదూర్‌పల్లి బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.21లక్షలు విలువ చేసే 45తులాల బంగారం,3కేజీ వెండి ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని విచారణ నిమిత్తం రిమాండ్‌కు తరలించారు.

### మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



యూసుఫ్‌గూడ, జూలై 10, ప్రభాతవార్త : బోరబండ అన్నానగర్‌లో నివాసముంటున్న కోమర్ల అరుణ(33) ఆదివారం ఉదయం ఇంటినుండి వెళ్ళింది. మాదాపూర్‌లోని ఒక ప్రైవేటు సంస్థలో హౌస్‌కీపింగ్‌గా పనిచేస్తున్న మహిళ ఇంటినుంచి వెళ్ళి తిరిగి రాకపోవడంతో ఆమె బంధువులు బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళ మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు.

## కుత్బుల్లాపూర్‌లో కేంద్ర ఎన్నికల సంఘ బృందం పర్యటన

**ఓటరు జాబితాను అకస్మిక తనిఖీచేసి తొలగించిన వారి జాబితా పునఃపరిశీలన**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అధికారుల బృందం

కుత్బుల్లాపూర్, జూలై 10 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఓటరు జాబితాను తనిఖీ చేసేందుకు కేంద్ర ఎన్నికల బృందం హాజరయింది. సోమవారం కుత్బు ల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన అకస్మిక తనిఖీలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘ అధికారులు ప్రమోద్‌కుమార్ శర్మ, రితేష్‌సింగ్‌ల బృందం పర్యటించింది. మేడ్చెల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, అభిషేక్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగతాయారు, కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారి సంజీవరావు, బాచుపల్లి మండల రెవెన్యూ అధికారి సురేందర్, గండి మైసమ్మ మండల రెవెన్యూ అధికారి పద్మప్రియల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధి లోని రెవెన్యూ, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లకు చెందిన సిబ్బంది పాల్గొని తొలగించిన ఓటరు జాబితాలో తప్పుఒప్పులను క్షుణ్ణంగా పరిశీలించారు.

### గ్యాస్ సిలిండర్లను అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

యూసుఫ్‌గూడ, జూలై 10, ప్రభాతవార్త : బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బోరబండలో నివాసముంటున్న షేక్ అబ్దుల్ అజీజ్ గత కొంతకాలంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లని చిన్న సిలిండర్లలో నింపి వాణిజ్య పరంగా వ్యాపారం చేస్తున్నాడు. ఇతని వద్దనుంచి రెండు పెద్ద సిలిండర్లు, 15చిన్న సిలిండర్లను గ్యాస్ కిట్లును స్వాధీనం చేసుకున్నారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లని ఎవరైనా దురుద్దేశ్యంతో అక్రమంగా అందించాలని వ్యాపారం చేసినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటున్నామని బోరబండ సిఐ కామల్ల రవికుమార్ తెలిపారు.

## పిస్తోలుతో తిరుగుతున్న వ్యక్తి అరెస్టు



పిస్తోలు, మ్యాగ్‌జైన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

మన్సూరాబాద్, జులై 10 ప్రభాతవార్త: అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎల్.బి.నగర్ పోలీసులు అతని నుంచి దేశీయ తయారీ పిస్తోలును, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. జార్కండ్ రాష్ట్రం సాహెబ్‌గంజ్ జిల్లా మాసాన్య గ్రామానికి చెందిన మహ్మద్ షాబుద్దిన్ అన్సారీ(26) నగరానికి వచ్చి కందుకూర్‌లో నివాసం ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఖర్చులు ఎక్కువై తనకు వచ్చే కూలీ డబ్బులు సరిపోక పోవడంతో అతను బీహార్‌కు వెళ్లి అక్కడినుంచి పిస్తోలును కొనుగోలు చేశాడు. దానిని నగరంలో అమ్మడానికి తిరిగి వచ్చాడు. ఈనెల 9న సాయంత్రం సికింద్రాబాద్‌లో రైలుదిగి ఎల్.బి.నగర్ వరకు వచ్చాడు. సాయంత్రం 5.30 గంటల సమయంలో ఎల్.బి.నగర్ నుంచి కందుకూర్ వెళ్లడానికి మరో బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. అటుగా వెళ్తున్న ఎల్.బి.నగర్ పెట్రోలింగ్ పోలీసులకు అనుమానాస్పద స్థితిలో కన్పించాడు. వారు అతన్ని వివరాలు సేకరిస్తూ సంచిలో చూడగా దేశీయ పిస్తోలు, రెండు ఖాళీ మ్యాగ్‌జైన్స్, ఒక లైవ్‌రౌండ్ అమ్యునిషన్, ఒక ఖాళీ కార్ట్రిజ్ కన్పించాయి. పిస్తోలును తాను బీహార్‌నుంచి కొనుగోలు చేశానని, దానిని ఎక్కువ ధరకు నగరంలో అమ్మడానికి తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నాడు. ఈమేరకు అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు సంచిలోని పిస్తోలు, ఇతర వస్తువులు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆర్యవైశ్యుల హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాటం చేయాలి



బోరబండ మోతీనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా రతకంటి సాయిబాబా గుప్తను ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సంఘం చైర్మన్ ఉప్పల శ్రీనువాస్ గుప్త

యూసుఫ్‌గూడ, జూలై 10, ప్రభాత వార్త : ఆర్యవైశ్యుల హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాటం చేయాలని ఆ సంఘం చైర్మన్ ఉప్పల శ్రీనువాస్ గుప్త అన్నారు. ఈసందర్భంగా ఆర్‌కె సొసైటీలోని ఆర్యవైశ్య సంఘం కార్యలయంలో నూతన అధ్యక్ష, కమిటి సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. బోరబండ మోతీనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా రతకంటి సాయిబాబా గుప్త ప్రధాన కార్యదర్శిగా కైలాస శ్రీనువాస్ గుప్త, కోశాధికారిగా కొక్కొండ ప్రేమ్‌కుమార్ గుప్త, మహిళా సంఘం అధ్యక్షురాలుగా పబ్బ సుధ, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి లలిత, కోశాధికారిగా మీన, తదితరులను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షులు రతకంటి సాయిబాబా గుప్త మాట్లాడుతూ సంఘం సభ్యత్వాలను పెంచేందుకు తన కృషి చేస్తానని అదేవిధంగా ఆర్యవైశ్యులకు తమ వంతుగా సంఘం తరపున సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. సరాబు లక్ష్మణ్‌గుప్త, జైని లక్ష్మణ్ గుప్త, ఊటుకూరి శ్రీనువాస్ గుప్త, పాల్గొన్నారు.

# నగరంలో పెరుగుతున్న చికెన్‌పాక్స్

**జ్వరంతోపాటు ఒంటిపై పొక్కులు, ఎర్రటి దద్దుర్లు**

**రెండు నుంచి తొమ్మిదేళ్ల పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తున్న అంటువ్యాధి**

**పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు**



హైదరాబాద్, జులై 10 ప్రభాతవార్త : నగరంలో చికెన్ పాక్స్ కేసులు పెరుగుతున్నాయి. దీన్ని ఆటలమ్మ అని కూడా అంటారు. ఆటలాడే వయసులో చిన్నారుల్లో కనిపిస్తుంది. కేవలం చిన్నపిల్లలోనే కాదు అప్పుడప్పుడు పెద్దవారికి, గర్భవతులకు వస్తుంది.చికెన్‌పాక్స్ ఇప్పుడు సాధారణ జలుబు, ఫ్లూ లాగే ఎక్కువగా కనిపిస్తోంది. అందునా పెద్దలతో పోలిస్తే పిల్లల్లో మరీ ఎక్కువ ఇది రెండు నుంచి తొమ్మిదేళ్ల పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంటుంది.అంటువ్యాధులలో చికెన్‌పాక్స్ చాలా సాధారణంగా కనిపించే వైరస్. వారిసెల్లా జోస్టర్ అనే వైరస్ వల్ల ఇది వస్తుంది. మొదట ఒకసారి వచ్చి ఉన్నా. లేదా దీని కోసం వ్యాక్సిన్ తీసుకొని ఉన్నా మళ్లీ మరోసారి రావడం చాలా తక్కువ. కానీ ఇంతవరకూ ఎప్పుడూ చికెన్‌పాక్స్‌కు గురికాని వారిలో ఇది కనిస్తుంది. చికెన్‌పాక్స్ ఒకరి నుంచి మరొకరికి నేరుగా వ్యాపిస్తుంటుంది. ఇది వచ్చినవారి ఒంటిపై పొక్కులు, దద్దుర్ల వంటివి కనిపిస్తాయి. ఇది సోకిన వారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు గాలి, తుప్పర్ల ద్వారా ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. మనలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నప్పుడు ఇది చాలా ఇబ్బంది పెడుతుంది. తగ్గడమూ ఒకింత కష్టమవుతుంది. ఒంటిమీద వచ్చే ఈ దద్దుర్ల వంటివి దశలవారీగా వస్తున్నట్లు కనిపిస్తాయి. మొదట వచ్చిన ఎర్రటి దద్దుర్లు ఒకటి నుంచి రెండు రోజుల్లో దగ్గుతాయి. ఆ తర్వాత వచ్చిన దద్దుర్లు మెల్లగా తగ్గడం మొదలుపెట్టినట్లుగా ఎండిపోతూ ఉంటాయి. ఐదు నుంచి ఏడు రోజుల పాటు ప్రతిరోజూ ఇలా కొత్త కొత్త దద్దుర్లు కనిపిస్తూనే ఉంటాయి. పదిరోజుల్లో ఇవన్నీ పూర్తిగా మానుబట్టాక మాత్రమే పెద్దలు కూడా కార్యాలయాలకు, బయటకు వెళ్లాలి. దద్దుర్లనూ వాటి తీరును చూడగానే డాక్టర్లు, వాటిని గుర్తించి చికెన్‌పాక్స్‌ను నిర్ధారణ చేస్తారు. అవసరమైతేనే ల్యాబ్ టెస్ట్ ద్వారా నిర్ధారణ చేయాల్సి వస్తుంది.దాని మానాన దాన్ని వదిలేసినా చికెన్‌పాక్స్ వచ్చి ఆ తర్వాత తనంతట తానే తగ్గిపోతుంది. అయితే కేవలం వ్యాధి కలిగించే బాధ నుంచి ఆ దుద్దుర్ల దురద నుంచి ఉపశమనం కలిగించడానికి వ్యాధి కలిగించే బాధ నుంచి తర్వాత మరికొన్ని కాంప్లికేషన్లు రాకుండా ఉండటానికి వ్యాధి తీవ్రతను తగ్గించడానికి డాక్టర్లు మందులను సూచిస్తారు. అయితే కొన్నిసార్లు తీవ్ర దుష్ప్రభావాలకు దారితీస్తుంది.దీనివల్ల వచ్చే అనర్థాలలో ముఖ్యమైనది పెద్దల్లో కనిపించే నిమోనియా, చికెన్‌పాక్స్ వల్ల వచ్చే ఈ దుష్ప్రభావాన్ని వారిసెల్లా నిమోనియా అంటారు.చికెన్‌పార్స్ నివారించే వ్యాక్సిన్ అన్ని చోట్లా లభ్యమవుతోంది. దీన్ని రెండు డోసులలో ఇస్తారు. పిల్లలకు దీన్ని 12-18 నెలల వయసులో మొదటి మోతాదు ఇస్తారు. అలాగే 4-6 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు రెండో డోస్ ఇస్తారు.ఈ వ్యాక్సిన్ తీసుకోని వారు గతంలో చికిఎన్‌పాక్స్ రాని వారు..ఇది సోకినవారిని నుంచి దూరంగా ఉండాలి.

**లక్షణాలు ఎలా ఉంటాయి?..**

ఇది సోకిన వారిలో కొన్ని నీటిపొక్కుల వంటివి, మరికొంత ర్యాష్ వంటిది ఒంటి మీద కనిపిస్తుంది.తలనొప్పి, జ్వరంతో ఆకలి తగ్గుతుంది. దగ్గు గొంతు బొంగురుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తొలుత జ్వరంతో మొదలై ఆ తర్వాత తల నుంచి ప్రారంభించి కింది వైపునకు ఈ దద్దుర్లు వస్తూ పెరుగుతూ పోతుంటాయి. ర్యాష్ కనిపించిన తర్వాత నాలుగు ఐదు రోజుల తర్వాత నుంచి తమ నుంచి మరొకరికి వ్యాపించవచ్చు. ఈ ర్యాష్‌లో కాస్తంత దురదగా కూడా ఉండవచ్చు.ఇది వచ్చిన పిల్లలు స్కూల్‌కు వెళ్లకుండా చూసుకోవాలి. పెద్దలైతే బయటకు వెళ్లకుండా, ఇతరులకు దూరంగా ఉండాలి.

**రోగి విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలేమిటీ?..**

రోగికి నిత్యం తగినంత ద్రవాహారం ఇస్తూ డీహైడ్రేట్ కాకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఉప్పు, మసాలాలు వీలైనంత తక్కువగా ఉండే ఆ హారాన్ని ఇవ్వడం మంచిది. ఆహారంలో ఎలాంటి పథ్యాలు పాటించాల్సిన అవసరం లేదు. రోగి అన్నం నమలలేకపోతుంటే, దాన్ని ద్రవరూపంలోకి మార్చి ఇవ్వడం మేలు.

## బోనాల పండగ నిర్వ్వాహణకు చెక్కుల పంపిణీ

**89 దేవాలయాలకు అందజేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



ఆలయ కమిటీ ప్రతినిధులు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జూలై 10,ప్రభాతవార్త: అంబర్‌పేట్ నియోజకవర్గంలో బోనాల పండగ నిర్వాహణకోసం ఆయా ఆలయ కమిటీలకు ప్రభుత్వం నుంచి మంజూరైన సుమారు 34 లక్షల రూపాయలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందజేశారు. సోమవారం కాచిగూడలోని తుల్జాభవాని ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో బోనాల పండగున నిర్వాహణకు 89దేవాలయాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ నాయత్వంలో ప్రభుత్వం బోనాల పండుగకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందలో భాగంగా బోనాల పండుగ ఉత్సవాల కోసం ప్రతి ఆలయంలో ఘనంగా ఏర్పాట్లకు అండగా నిలుస్తుందన్నారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలో ప్రతి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలని, పూజలను వైభవంగా నిర్వహించాలని తెలిపారు. అవసరమైన అన్ని రకాల ఏర్పాటు చేయాలని, భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి, అమృత, ఉమార మేష్ యాదవ్ వివిధ ఆలయాల పాలక మండలి ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని విధిగా నిర్వహించండి



కలెక్టరేట్ కార్యాలయం ముందు బీజేపి నాయకుల నిరసన

నిజాంపేట్,జూలై10 ప్రభాతవార్త: మేడ్చల్ జిల్లా కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని గత 9వారాలుగా ఎందుకు నిర్వహించడం లేదని అధికారులు, ప్రజా ప్రతినిధులను నిజాంపేట్ బీజేపి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించకపోవడంతో అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యకు ప్రభుత్వ భూముల ఆక్రమణలపై బీజేపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపి నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రా ష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం మేడ్చల్ జిల్లాలో మాత్రం ఎందుకు నిర్వహించడంలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపి అధ్యక్షుడు ఆకుల సతీష్, నాయకులు భిక్షపతియాదవ్, శేషారావు, అజయ్‌కుమార్‌రెడ్డి, కౌశిక్‌నాయుడు, ప్రసాద్‌రాజు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాపార్కు అభివృద్ధికి వెనుకడుగు వేసే ప్రసక్తిలేదు

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



వాకింగ్ ట్రాక్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

ధర్నాచౌక్, జూలై 10, ప్రభాతవార్త: ఇందిరాపార్కు అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పష్టం చేశారు. సోమవారం ఇందిరాపార్కులో పదిలక్షల రూపాయల నిధులతో ఏర్పాటుచేస్తున్న శాండ్ వాకింగ్ ట్రాక్‌లకు ఆయన స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతో కలసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఇందిరాపార్కులో అనేక మంది వాకింగ్ కోసం నిత్యం సందర్శిస్తూ ఉంటారని, వారికి ఎదురయ్యే సమస్యలు ఇటీవల తమ దృష్టికి రావటంతో పార్కులో ఉన్న అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. బీచ్‌లలో ఉండే విధంగా ఆక్యుప్రెషర్ లాగా పనిచేసేందుకు అనుకూలంగా శాండ్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, బీజేపీ డివిజన్ అధ్యక్షులు మహేందర్ బాబు, నాయకులు వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు రాజశేకర్ గౌడ్, మాధవి, జీహెచ్ఎంసీ, హార్టికల్చర్ అధికారులు సన్నీ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ చేయూత



మంచిరేవులలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న దృశ్యం

నార్సింగి, జూలై 10 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు సత్య సుందర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా స్కూల్ బ్యాగ్‌లు, నోటు బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మేకల ప్రవీణ్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద విద్యార్థులే చదువుకుంటున్నారని, అలాంటి వారికి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. సమాజంలో ఆర్థికంగా స్థిరపడ్డ వారు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇలా నిరుపేద విద్యార్థులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. చాలా మంది విద్యార్థులకు చదువుపై ఆసక్తి ఉన్నా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మధ్యలోనే చదువులు మానుకోవాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా 180.మంది విద్యార్థులకు బ్యాగ్‌లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పొన్న రమేష్, సత్య సుందర్ సంస్థ ఫౌండర్ గోపాల్‌సింగ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడినడ, మహేష్‌రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రవి తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్‌జే స్థలాలపై సుప్రీం తీర్పును అమలు చేయాలి

**రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్**



హైదరాబాద్, జూలై 10,ప్రభాత వార్త: జెఎన్‌జే హౌజింగ్ సొసైటీ స్థలాల విషయంలో రెండుతరాల జర్నలిస్టుల మధ్య పోటీ పెట్టడం తగదని..సుప్రీం కోర్టు తీర్పు వచ్చి పదినెలలు పూర్తయినా ఈస్థలాలు స్వాధీనం చేయడంతో ప్రభుత్వం చేస్తున్న జాప్యం సభ్యులు ఆందోళన చెందుతున్నారని పలువురు మీడియా సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ ఫౌండర్ మెంబర్ పివి రమణరావు అధ్యక్షతన జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ మ్యాక్ హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జే మ్యాక్ హెచ్ఎస్ ) రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. దీనికి సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, దిలీప్‌రెడ్డి, మిట్టపల్లి శ్రీనివాస్, పాశంయాదగిరి తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తుది తీరు అమలు విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. సుప్రీం తీర్పును అమలు చేయకపోవడం ద్వారా ప్రభుత్వమే కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసేందుకు అవకాశం ఇచ్చిందన్నారు. ఆగస్టులోగా తుదినిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని ఈలోగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో చర్చించి వారి మద్దతు తీసుకోవాలని దీనివల్ల ప్రభుత్వంపై ఒత్తిడి కల్పించేందుకు వీలవుతుందన్నారు. పేట్ బషీరాబాద్ స్థలం విషయంలో జాప్యం ఎందుకు జరుగుతుందో చర్చించాల్సిన అవసరం ఉందని జెన్‌జేకి చెందిన 1100మందితో మిగతా 5వేలమంది సభ్యుల స్థలాలతో పోటీపెట్టడం భావ్యం కాదన్నారు. గతంలో ప్రెస్‌అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ నిర్వహించిన సమావేశంలో సైతం జెన్‌జె సొసైటీ స్థలాలు మరొకరితో ముడిపెట్టడం తగదని, వారి స్థలాలు వారికే ఇవ్వాలని సూచించిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో పలువురు జెన్‌యు సభ్యులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న నాయకులు



అమ్మ వారిని దర్శించుకున్న మాజీ కేంద్ర మంత్రి సర్వే,టీటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,కంటోన్మెంట్ టీడీపీ ఇంచార్జ్ ముప్పిడి

బేగంపేట జులై 10,ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కంటోన్మెంట్ టీడీపీ ఇంచార్జ్ ముప్పిడి గోపాల్‌లు అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మ వారి దర్శనం అనంతరం సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ సోనియా గాంధీకి సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని, రాహుల్ గాంధీ రానున్న కాలంలో ప్రధాని కావాలని, అందుకు అవసరమైన శక్తిని ప్రసాదించాలని,రాష్ట్ర ప్రజలందరినీ అమ్మ వారు చల్లగా చూడాలని కోరుకున్నానన్నారు.ముప్పిడి గోపాల్ మాట్లాడుతూ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాలకు ఎంతో చరిత్ర ఉందని,కోరిన కోర్కెలు తీర్చే తల్లి ఉజ్జయినీ మహాకాళీ అని,రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను అమ్మ వారు చల్లంగా చూడాలన్నారు. దళిత రత్న దర్గ రవికుమార్,పరమేష్,నరేష్,సంపత్‌గౌడ్ వారి వెంట ఉన్నారు.

## జీవో నెం.16 ప్రకారం రెగ్యూలరైజ్ చేయాలి



మంత్రి సబితా ఇంద్రారెడ్డికి రెగ్యూలరైజ్ చేయాలని కోరుతున్న ఓ.యూ కాంట్రాక్ ఎంప్లాయిస్

తార్నాక, జులై 10 ప్రభాతవార్త: దీర్ఘకాలికంగా పనిచేస్తున్న తమను జీవో నెం.16 ప్రకారం రెగ్యూలరైజ్ చేయాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఉద్యోగులు మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. రెగ్యూలరైజ్‌ను ఏవిదంగా చేయాలనే విషయాలను మంత్రికి వారు క్లుప్తంగా వివరించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి ఈ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఒ.యూ నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘ నాయకులు ఎడ్ల అంజయ్య, వీరేశం, రాము, అభిలాష్, అరుణ్, చేతన, చరణ్ సింగ్ మెహర్, మల్లేష్, నర్సింగ్ యాదవ్, గౌతమ్, సురేష్, రాజశ్రీ, సతీష్, రామకృష్ణ, అలిముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బంగారు మైసమ్మకు శాఖంబరి అలంకరణ



సికింద్రాబాద్, జూలై 10 ప్రభాతవార్తః ఈనెల 16న జరిపే బోనాల ఉత్సవాలలో భాగంగా సీతాఫల్‌మండి మధురానగర్‌లోని శ్రీబంగారు మైసమ్మ అమ్మవారు భక్తులకు శాఖంబరి అలంకరనలో దర్శనమిస్తారని ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, తెలిపారు. ఉదయం 9గంటలకు పంచహారతులు, వివిధ రకాల కూరగాయలతో అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుంటారని చెప్పారు. ముఖ్య అతిథిలుగా డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, కార్పొరేటర్ సామలహేమ, కందిశైలజలు పాల్గొంటారని పేర్కొన్నారు.

### అభివృద్ధి పనులు ప్రారంభించిన కార్పొరేటర్



అడ్డగుట్ట, జూలై 10 ప్రభాతవార్తః అడ్డగుట్ట ఏ సెక్షన్‌లో సివరేజీ పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ సోమవారం శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సహకారంతో డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు. మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యాక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, నేతలు నక్కామధు, శ్రీనివాస్ గౌడ్, నరేష్, ఇస్మాయిల్, గోపి, మల్లేష్, శివశంకర్, శ్రీశైలం, భాగ్య పాల్గొన్నారు.

## నవభారత్ నిర్మాణమే భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



హైదరాబాద్, జూలై 10,ప్రభాతవార్త: నవభారత్ నిర్మాణమే భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆపార్టీ వ్యవస్థాపకులు సంజయ్ అగర్వాల్ ,జాతీయ అధికార ప్రతినిధి ఆర్‌కెఎం రాజు అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ సౌతిండియా కార్యాలయాన్ని హైదరాబాద్‌లోని లక్డీకపూల్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. తమ పార్టీ ప్రజాసమస్యలపై ఎప్పుడూ పోరాటం చేస్తుందని ఇప్పటికే కర్ణాటక, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్ రాష్ట్రాల్లో స్థానిక సంస్థల్లో సత్తా చాటిందన్నారు. నల్లధనాన్ని పూర్తిగా అరికట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. జాతీయ అధికార ప్రతినిధి ఆర్‌కెఎం రాజు మాట్లాడుతూ ప్రతి పౌరుడికి న్యాయం చేసేందుకు టోల్‌ఫ్రీనంబర్ ఏర్పాటు చేశామని ప్రధాన మంత్రి మొదలుకుని సామాన్య స్థాయి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తమపార్టీ కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మోహన్ పాల్గొన్నారు.

### డివిజన్‌ల కాంగ్రెస్ అధ్యక్షుల కమిటి ఏర్పాటు

యూసుఫ్‌గూడ, జూలై 10, ప్రభాతవార్త : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో డివిజన్‌ల కాంగ్రెస్ అధ్యక్షుల కమిటిని ప్రకటించారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని 6డివిజన్‌లకు చెందిన అధ్యక్షులను ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటించారు. యూసుఫ్‌గూడ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సురేందర్ యాదవ్‌ను, వెంగళరావునగర్ డివిజన్‌కి బిట్ల సురేష్‌కుమార్, ఎర్రగడ్డ కృష్ణకుమార్‌ను, రహ్మత్‌నగర్ మహ్మద్‌లియాకత్ ఆలీని, బోరబండ బి.అశోక్, షేక్‌పేట్ సత్యనారాయణను అధ్యక్షులుగా నియమిస్తూ ప్రకటన చేశారు.



మహంకాళి ఆలయం వద్ద పోతరాజుల విన్యాసాలు

## దేవాలయాలకు చెక్కుల పంపిణీ

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

మెహిదీపట్నం, జులై 10, ప్రభాతవార్త : నగరంలో బోనాల ఉత్సవాలు ఈనెల 16న జరుగుతుండడంతో దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. అందులో భాగంగా ఈ సంవత్సరం ఆలయాలకు ఆర్థిక సహాయాన్ని ముందుగానే అందజేశారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన ఆలయాలకు సోమవారం గుడిమల్కాపూర్‌లోని ఝూంసింగ్ దేవాలయ ఆరణలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై దేవాలయాల చైర్మన్‌లకు చెక్కులను అందజేశారు. అంతనరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను నేడు అనేక దేశాలలో నిర్వహిస్తున్నారని, ఇది మనకెంతో గర్వకారణమన్నారు. బోనాల ఉత్సవాలను ప్రజలు గొప్పగా సంతోషంగా జరుపుకోవాలనేది సీఎం కేసీఆర్ ఆలోచనన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి అధికారికంగా నిర్వహిస్తూ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, బిఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ జీవన్‌సింగ్, మాజీ కార్పొరేటర్లు మిత్ర క్రిష్ణ, బంగారి ప్రకాష్, నాయకులు కె. శేఖర్‌రెడ్డి, దేవర వంశీ, కోదూరు శ్రీదర్‌సాగర్, లక్ష్మినారాయణ, గోల్కొండ జగదాంబిక దేవాలయ చైర్మన్ ఆరెల్ల జగదీష్ యాదవ్, కార్వాన్ సబ్జిమండి నల్లపోచమ్మ-మహంకాళి దేవాలయ చైర్మన్ ప్యాట నందకిషోర్‌లతో పాటు పలు దేవాలయాల చైర్మన్‌లు పాల్గొన్నారు.

**జగదాంబ దేవాలయం కమిటీ చైర్మన్**



గోల్కొండ దేవాలయ చైర్మన్ ఆరెల్ల జగదీష్ యాదవ్‌కు చెక్కును అందిస్తున్న మంత్రి తలసాని

**రాకేష్ తివారీకి చెక్కును అందజేసిన మంత్రి**

**చాంద్రాయణగుట్ట..** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఆషాడమాస బోనాల ఉత్సవాలను ప్రజలు గొప్పగా, సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం పాతబస్తీ గౌలిపురాలో భరతమాత దేవాలయం వదనద బోనాల పండుగ సందర్భంగా 358 దేవాలయాలకు మంజూరైన 2.13 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆర్థిక సహాయం చెక్కులను ఆయన ఉమ్మడి దేవాయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు ఆలె భాస్కర్‌రాజ్, కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మితో కలిసి ఆయా దేవాలయాల కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ డిప్యూటి కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, దేవాయాల కమిటీ సభ్యులు రాకేష్ తివారి, గాజుల అంజయ్య, కైలాష్ వీర్, మధు యాదవ్, మధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

నేరేడ్‌మెట్. జూలై 10 ప్రభాతవార్త: ఇంటి నుండి వెళ్లిపోయిన చిన్నారులను 24గంటల్లో సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నేరేడ్‌మెట్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్‌మెట్ పోలీస్టేషన్ పరిధిలోని సంతోషిమా నగర్‌లో గాయత్రి వద్ద నివాసము ఉంటున్న పుట్ట ఇందు (13), కోదూరు లకిత (6)లు మల్కాజిగిరి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఈ నెల 9వ తేదీనా తప్పిపోయినట్లు రాత్రి 8గంటలకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి సీసీ కెమెరాల ద్వారా తెలుసుకొని తల్లికి అప్పగించడం జరిగిందన్నారు. చదువుపై శ్రద్ధ తక్కువ అవుతుండడంతో తల్లి హాస్టల్‌లో వేస్తానని చెప్పడంతో ఇద్దరు చిన్నారులు రాత్రి 8గంలకు ఎవ్వరికి చెప్పకుండా నేరేడ్‌మెట్‌లో నుండి జెబియస్ ఆటోలో, జెబియస్ నుండి సిద్దిపేటకు ఆర్టీసి బస్సులో సిద్దిపేటలోని బాలసదన్‌కు వెళ్ళినట్లు తెలిపారు. ఇద్దరు బాలికలు మైనర్లు కావడం వల్ల వారికి ఎటువంటి ఆపద రాకుండా 24గంటల్లోనే వారిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందన్నారు.

## ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలోని స్థలం స్వాధీనం

**600 గజాల స్థలానికి హద్దులను ఏర్పాటు చేసిన హెచ్ఎండీఏ**

హయత్‌నగర్, జులై 10 ప్రభాతవార్త: ప్రభుత్వ స్థలాలలో నిర్మించుకున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు తీసుకువచ్చిన జీవో.58, 59లను కొంతమంది వ్యక్తులు దుర్వినియోగం చేస్తున్నారు. హయత్‌నగర్ మండల రెవెన్యూ పరిధి వీరన్నగుట్ట రామలింగేశ్వర ఆలయ సమీపంలో సర్వేనెంబరు 195/1లోని 10.11 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిరక్షణ నిమిత్తం ప్రభుత్వం హెచ్ఎండీఏకు అప్పగించింది. ప్రస్తుతం ప్రభుత్వం జీవో.58,59ను అమలు చేస్తున్న నేపథ్యంలో ఆప్రాంతంలో ప్లాట్లను కొనుగోలు చేసిన ప్రైవేటు వ్యక్తులు పక్కనే హెచ్ఎండీఏకు అప్పగించిన స్థలాన్ని సైతం అక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈక్రమంలో సుమారు 600 గజాల స్థలం అన్యాక్రాంతం అవుతుందన్న విషయాన్ని హెచ్ఎండీఏ సైట్ ఆఫీసర్ గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. హెచ్ఎండీఏ ఎస్టేట్ అధికారి కిషన్‌రావు ఆదేశాల మేరకు హయత్‌నగర్ ఆర్ఐ వి.వి.శర్మ, హెచ్ఎండీఏ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ జగన్మోహన్, సైట్ ఆఫీసర్ రాఘవేంద్రరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ యంత్రాంగం సోమవారం సదరు 600 గజాల స్థలాన్ని సర్వేచేసి అందులోని ఆక్రమణలను తొలగించి హద్దులను ఏర్పాటు చేశారు.

### తెలుగు విశ్వవిద్యాలయ ప్రవేశాలకు ఈ నెల 15 చివరితేదీ

నాంపల్లి, జూలై 10 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికిగాను వివిధ కోర్సులలో అర్హులైన విద్యార్థుల ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఈ నెల జూలై 15 శనివారం వరకు పొడగించినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టురమేష్ తెలిపారు. 100 రూపాయల ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తెలుగుయూనివర్సిటీ.ఏసి.ఇన్‌లో సంప్రదించవచ్చునని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

## బంగారు మైసమ్మ దేవాలయంలో వైభవంగా బోనాలు



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం కమిటి అధ్యక్షులు వినయ్ దిలీకర్,ప్రధాన కార్యదర్శి మధుసూధన్ యాదవ్ తదితరులు

చార్మినార్,జూలై 10 ప్రభాతవార్త: పాతబస్తీ హరిబౌలిలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో అత్యంత వైభవంగా ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన బోనాల జాతర ఉత్సవాలు 16వ తేదీ వరకు కొనసాగనున్నాయి.16వ తేదీ ఆదివారం రోజున దేవాలయంలో అమ్మవారికి బోనాల పమర్పణ,సుశీలమ్మచే రంగం కార్యక్రమం,17వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పూలతో అలంకరించబడిన రథంపై అమ్మవారి ఘటం ఊరేగింపు మందిరం నుంచి ప్రారంభమై నయాపూల్‌లోని ఢిల్లీ దర్వాజ మూసీనది వరకు కొనసాగుతుందని దేవాలయం కమిటి అధ్యక్షులు వినయ్ దిలీకర్,ప్రధాన కార్యదర్శి మధుసూధన్ యాదవ్‌లు తెలిపారు.కాగా సోమవారం జరిగిన సమావేశంలో ఆలయం కమిటి ఉపాధ్యక్షులు హంసరాజ్,కార్యదర్శి రాజేష్,కోశాధికారి సిరిగిరి పాపయ్య,సంయుక్త కార్యదర్శి శ్రీ హరి,కమిటి ప్రతినిధులు నోముల ప్రకాష్,హరేంద్ర యాదవ్, సాయినాగ్,దేవిరాజ్,సాయినాగ్, ఆశ్రయ, కార్తీక్,మహేందర్,రవిచారి,రవి కృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వైభవంగా బోనాల నిర్వహణకు ఏర్పాట్లు



మధురానగర్ కట్టమైసమ్మ దేవాలయం వద్ద రోజు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేదిప్య విజయ్‌కుమార్

యూసుఫ్‌గూడ, జూలై 10, ప్రభాతవార్త : రాబోయే బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఆలయాల వద్ద తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కార్పొరేటర్ దేదిప్య విజయ్‌కుమార్, అన్నారు. సోమవారం మధురానగర్‌లోని కట్టమైసమ్మ దేవాలయం వద్ద ఆధ్వానంగా ఉన్న రహదారి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా బోనాల పండుగ వరకు ఆలయం చుట్టు ప్రక్కల ఎలాంటి మట్టికుప్పలు లేకుండా వాటిని తొలగించి రోడ్డును ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజ్‌కుమార్, కాలనీ అధ్యక్షులు సాంబశివరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అసభ్యకర పోస్టులపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, జూలై 10, ప్రభాతవార్త : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై, వారి కుటుంబ సభ్యులపై అధికార పార్టీకి చెందిన కొందరు నగరంలో ఉంటూ సోషల్ మీడియా మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెడుతున్న నేపథ్యంలో జనసేన తెలంగాణ ఇన్‌చార్జ్ ఎన్.శంకర్‌గౌడ్, స్పందించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల నగరంలో పవన్‌కళ్యాణ్‌పై అసభ్యకర పోస్టులను పెడుతున్నారని అలాంటి వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారి అకౌంట్లను బ్లాక్ చేయాలని సైబర్ క్రైమ్ కార్యాలయంలో ఏసిపిని కలిసి ఫిర్యాదు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారం రాజలింగం వీరమహిళా విభాగం వారు పాల్గొన్నారు.

## పేదల ఇళ్ళను కూల్చడం అన్యాయం: మాజీ ఎమ్మెల్యే

జీడిమెట్ల, జూలై10 ప్రభాతవార్త: జీఓ 59 ధరఖాస్తుదారులు రుసుము చెల్లించలేదని రెవెన్యూ అధికారులు వారి ఇళ్ళను కూల్చివేయడాన్ని తప్పు పట్టారు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్. సోమవారం 59 జీఓ ధరఖాస్తుదారులతో కలిసి శ్రీశైలంగౌడ్ కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా నామ మాత్రపు రుసుముతో పేదవారి ఇండ్లను క్రమబద్ధీకరించాలని డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల ఇండ్లకు రుసుము చెల్లించాలని అందజేసిన డిమాండ్ నోటీసులను ఉపసంహరించుకోవాలన్నారు. డబ్బులు చెల్లించకుంటే ఇళ్ళను కూల్చివేస్తామని బెదిరింపులకు దిగుతున్న రెవెన్యూ అధికారులు దోపిడి ముఠాలుగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోని అధికారులు పేదల ఇళ్ళపై ఇలా దౌర్జన్యానికి దిగడం సరికాదన్నారు.

### విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్, జూలై10 ప్రభాతవార్త: 33/11కేవీ బొల్లారం సబ్‌స్టేషన్-3 మరమ్మత్తుల కారణంగా 11కేవీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో మంగళవారం విద్యుత్ ఉండదని అధికారులు పత్రికా ప్రకటనలో తెలిపారు. 11కేవీ బాలాజీ వెంచర్, మల్లంపేట్, ప్రణీత్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ ఉండదు. అదే విధంగా 33కేవీ ఎఫ్‌టీఓ-2,ఎఫ్‌టీఓ-3, బాచుపల్లి పరిధి 11కేవీ మల్లంపేట్, ఏస్‌టైర్స్‌ఫీడర్ల పరిధిలోని రెయిన్‌బో కాలనీ, ప్రణీత్ జనీత్, ఇందిరా నగర్ ప్రధాన రహదారి నుంచి బాచుపల్లి సిగ్నల్, హోటల్ అంగార,ఫ్లైఓవర్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ ఉండదు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు.

## ప్రజలు కలిసి మెలిసి ఉత్సవాలు జరుపుకుంటున్నారు

**కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్**



పైనీరు ముత్యాలమ్మ దేవాలయం బోనాలు ఉత్సవాల బ్రోచర్‌ను కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్,ఆనంద్ గుప్తా విడుదల చేస్తున్న దృశ్యం

చార్మినార్, జూలై 10 ప్రభాతవార్త : ప్రజలు ఎంతో ఐకమత్యంతో కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకుంటున్నారని పురానాపూల్ డివిజన్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ అన్నారు.పాతబస్తీలో ఆయన దేవాలయం కమిటి చైర్మన్ డి.ఆనంద్ గుప్తాతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు.ఈ కారక్రమంలో శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయం కమిటి చైర్మన్ ఆనంద్ గుప్తా,అధ్యక్షులు వెంకటాచలం ముదిరాజ్,ప్రతినిధులు నర్సింహ్మా ముది రాజ్,శ్రీనివాస్‌చారి, సత్యనారాయణ, అమరేందర్‌లు పాల్గొన్నారు.

## బోనాల జాతరలో కరెంట్ షాక్‌తో యువకుడు మృతి

అడ్డగుట్ట, జూలై 10 ప్రభాతవార్తః సికింద్రాబాద్‌లోని మహంకాళి బోనాల ఉత్సవాలలో అపశృతి చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి కార్వాన్ ప్రాంతానికి చెందిన ఆకాష్‌సింగ్ (27) అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చాడు. విద్యుత్ స్తంభం తగిలి కరెంట్‌షాక్ రావడంతో మృతి చెందాడు. ఇది గమనించిన తోటి భక్తులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికి ఫలితం లేకపోయింది. యువకుడు మృతిచెందడంతో కొంతసమయం పాటు భక్తులు విషాదచాయల్లో మునిగిపోయారు. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### ఇంటినుంచి పారిపోయిన ఇంటర్ విద్యార్థి

యూసుఫ్‌గూడ, జూలై 10, ప్రభాతవార్త : కళ్యాణ్ నగర్‌లోని నివాసముండే అభిషేక్ అనే యువకుడు ఇంటినుంచి పారిపోయిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అభిషేక్(18) ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో ఫేయిల్ అయినందుకు బాధ పడుతూ ఇంట్లో వాళ్ళకు గానీ, స్నేహితులకు గానీ ఎవ్వరికి చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడనీ అతని తల్లి వజ్ర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గజ్వేల్, సిరిసిల్ల మాదిరిగా మహేశ్వరం అభివృద్ధి : సబితారెడ్డి


శంకుస్థాపన చేసిన మంత్రి సబితారెడ్డి : పక్కన కార్పొరేటర్ ముద్దా పవన్

**సరూర్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** గజ్వేల్, సిరిసిల్ల నియోజకవర్గాల మాదిరిగానే మహేశ్వరం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. మీర్‌పేట్ కార్పొరేషన్ 9, 10 డివిజన్లలో రూ.6 కోట్ల నిధులతో చేపట్టిన సిసి, బిటి రోడ్లనిర్మాణాలకు మంత్రి శ్రీకారం చుట్టారు. 10వడివిజన్ కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన సబితారెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రాంతాలను నిర్దేశిత లక్ష్యంతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రజలకు రోడ్లు, డ్రైనేజీ, తాగు నీరు, వీధి దీపాలు తదితర ప్రాథమిక సౌకర్యాలను కల్పించడంతో పాటు ఆహ్లాదాన్ని అందించడానికి పది చెరువులను రూ.40 కోట్లతో చెరువులను సుందరీకరిస్తున్నామని తెలిపారు. మంచి నీటి సమస్యలు ఏనాడు రాకుండా ఉండేందుకు మిషన్ భగీరథ ట్యాంకులను, రిజర్వాయర్లను నిర్మిస్తున్నామని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్ళ లాగా భావించి నియోజకవర్గాన్ని ముందుకు తీసుకుపోతున్నామని సబితారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు, డిఇఇ గోపినాథ్, కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతి నర్సింహ, నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, అర్కల కామేష్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, రామిడి నర్సి రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఈ నెల 12వ తేదీన జరిగే విద్యా సంస్థల బంద్‌కు సహకరించాలి : వామపక్ష విద్యార్థి సంఘాలు

**తుర్కయాంజాల్, జూలై 10 ప్రభాతవార్త:** జూలై 12న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ ఉంటుందని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు, ప్రభుత్వ కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపించడం లేదని విమర్శించారు. అనుమతులు లేకుండా నడుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రభుత్వం లాలూచీ విధానానికి నిదర్శనమన్నారు. పాఠశాలలు వ్యాపార కేంద్రాలుగా మార్చుకొని స్టేషనరీ సైతం తమ పాఠశాలలోనే విక్రయిస్తూ విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చే విధంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల తీరు కనిపిస్తుందన్నారు. ఈ నెల 12వ తేదీన జరిగే బంద్‌కు విద్యా సంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు: యెల్మేటి

**సరూర్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** బోనాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంనగర్ కాలనీలో భారీ ఎత్తున జరిగిన బోనాల ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమరేందర్‌రెడ్డిని ఆలయ కమిటీ వారు సన్మానించారు. బోనాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు జల్‌పల్లి మున్సిపాలిటీలో మత సామరస్యానికి ప్రతీకగా నిలవడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్,శ్రీనివాస్, అహ్మద్ బామ్, యూసుఫ్, వంగేటి మధుసూదన్ రెడ్డి, ఆంజనేయులు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీరాం కాలనీ బోనాలకు హాజరైన మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## గౌతమ్‌నగర్ డివిజన్‌లో రూ. 24 లక్షలతో సీసీ రోడ్డు పనులు : ఎమ్మెల్యే మైనంపల్లి

**మల్కాజిగిరి, జూలై 10 ప్రభాతవార్త:** గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో రూ. 24 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లు, కాలనీలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు రోడ్లు, డ్రైనేజీ, తాగు నీరు, వీధి దీపాలు తదితర ప్రాథమిక సౌకర్యాలను కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, సీనియర్ నాయకుడు మేకల రాముయాదవ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ సభ్యులకు క్రీడా సామాగ్రి పంపిణీ


సభ్యులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, జూలై 10 ప్రభాతవార్త:** బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలో బ్యాడ్మింటన్ గ్రౌండ్ సభ్యులు బి.యన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బ్యాడ్మింటన్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలని సూచనలు ఇచ్చారు. అనంతరం బ్యాడ్మింటన్ సభ్యులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుబ్రహ్మణ్యం, పవన్, రాజేష్, కిరణ్, అనిల్, రాజశేఖర్, సాయి, వీరు, కిరణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

## జల్‌పల్లి శ్రీరాం కాలనీలో ఘనంగా బోనాలు

**సరూర్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీలో బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ అమ్మవారికి పూజలు నిర్వహించి ఘటాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు కపిల్‌గౌడ్, శ్రీధర్, శ్రీకాంత్, దిలీప్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

**గ్రామ దేవతలకు పారిజాత పూజలు...** జల్‌పల్లి శ్రీరాం కాలనీలో బోనాల సందర్భంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో రవికుమార్, అబ్దుల్ బారి, శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక


పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

**మలక్‌పేట, జూలై 10 ప్రభాతవార్త:** మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్‌లోని నవదుర్గ మాత ఆలయంలో అఖిల భారత హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయనిర్వాహకులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలను అందజేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఉత్సవాలను ప్రజలందరూ కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు ఉమాశంకర్, సభ్యులు దానం శేఖర్, సురేష్, కతలయ్య, లక్ష్మణ్, రాజు, కుమార్, సనప్ప, డి.రాజు, ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఫెన్సింగ్ వేయాలి : కార్పొరేటర్ కొప్పుల


లే-అవుట్‌ను పరిశీలిస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి

**హయత్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలను కాపాడి వాటికి ఫెన్సింగ్ వేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అధికారులను డిమాండ్ చేశారు. హయత్‌నగర్ ఏరియాలోని శ్రీరామ్‌నగర్ కాలనీ సర్వేనెంబరు 97లోని పార్కు స్థలాన్ని ఆయన సోమవారం కాలనీ వాసులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బిఆర్ఎస్ నాయకులు పార్కులు, ప్రభుత్వ స్థలాలు, చెరువులను కబ్జా చేస్తున్నా పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు ప్రతిపక్ష పార్టీల నాయకులు స్వంతస్థలంలో ఒక గదిని నిర్మించుకున్నా... సంబంధిత పేపర్లు తీసుకురావాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. డివిజన్ పరిధిలోని పార్కు స్థలాలకు ఫెన్సింగ్ వేసి వాటిని రక్షించాలని రెండేళ్లకు పైగా కోరుతున్నా... అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పరోక్షంగా వారే కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోని పక్షంలో కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులతో కలిసి జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, సత్తిరెడ్డి, ప్రభాకర్‌గుప్తా, వెంకన్న, శ్రీనివాస్, నాయకులు రాఘవేందర్, కడారి యాదగిరి, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

## మామిడిపల్లిలో ప్యాచ్ వర్కు పనులు ప్రారంభం

**సరూర్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 11వ డివిజన్ మామిడిపల్లిలో చేపట్టిన సిసి రోడ్డు ప్యాచ్ వర్కు పనులను సోమవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ సుక్క శివకుమార్‌తో కలిసి మేయర్ రోడ్డు పనులను ప్రారంభించి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ జ్యోతి, ఎఇఇ విశాల్‌గౌడ్, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

## త్వరలో భగాయత్‌లో మంచినీటి కనెక్షన్లు: ఎమ్మెల్యే బేతి

**ఉప్పల్, జూలై 10 ప్రభాతవార్త:** ఉప్పల్ భగాయత్‌లో మంచినీటి కనెక్షన్ ఏర్పాటుకు జలమండలి ఎండి దానకిషోర్ సానుకూలత వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే భేతీ సుభాష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం పలువురునేతలతో కలిసి జలమండలి ఎండి దాన కిషోర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉప్పల్ భగాయత్ మంచినీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ స్వామి, సీజీఎం నాగేందర్, జిఎం సంతోష్‌కుమార్, డీజీఎం రజినీకాంత్ రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మహేందర్‌రెడ్డి,భార్గవ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి నియామకం


జైపాల్‌రెడ్డికి నియామక పత్రం అందిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

**హయత్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీకమిటీ అధ్యక్షుడిగా పసుమాముల గ్రామానికి చెందిన కొత్తపల్లి జైపాల్ రెడ్డి వరుసగా మూడోసారి నియమితులై హ్యాట్రిక్ సాధించారు. ఈ మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆయనకు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... పార్టీలో కష్టించి పనిచేసే వారికి గుర్తింపు తప్పకుండా ఉంటుందన్నారు. తెలంగాణలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని... పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈమేరకు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలన్నారు. జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పార్టీని బలోపేతం చేయడానికి కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో మూడోసారి కూడా పార్టీ బాధ్యతలను అప్పగించినందుకు అధినాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు.

## జీవోనెం.59 కింద రెగ్యులరైజేషన్ రుసుము తగ్గించేవరకు పోరాటం చేస్తాం : బీజేపీ

**హయత్‌నగర్, జూలై 10 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ పాలన నిజాం సర్కారు పాలనను తలపిస్తోందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. జీవోనెంబరు 59 ఇళ్ల రెగ్యులరైజేషన్ పేరిట పేదల నుంచి ఇష్టానుసారంగా డబ్బు వసూలు చేస్తున్న విషయమై బీజేపీ నాయకులు సోమవారం హయత్‌నగర్ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్మగల్ హయత్‌నగర్‌లోని పలు ప్రాంతాలకు చెందిన పేదలకు గత ప్రభుత్వాలు ఇళ్ల పట్టాలు వచ్చాయని తెలిపారు. ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం సదరు పట్టాదారులను జీవోనెం.59 కింద రెగ్యులరైజ్ చేసుకోవాలని చెప్పగా వారంతా దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. దాదాపు 30 ఏళ్ల క్రితం నుంచి పొసెషన్‌లో ఉంటు పట్టాలున్నా... జీవెనెం. 59 ప్రకారం వారికి లక్షల రూపాయలు చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. దీనిపై బీజేపీ ఆందోళన కొనసాగిస్తుండగా... చెల్లించాల్సిన డబ్బులను తక్కువ చేయకుండా ఇళ్లను కూల్చివేస్తామంటూ యజమానులను భయభ్రాంతులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ పేదలకు అండగా ఉంటుందని... ప్రభుత్వంతో పోరాడి రెగ్యులరైజేషన్ రుసుమును తగ్గించేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పారంద మహేష్, ఉగాది ఎల్లప్ప, పార్వతి పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో రూ.470 కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే బేతి


చిల్కానగర్‌లో సమస్యలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**ఉప్పల్, జూలై 10 ప్రభాతవార్త:** ఉప్పల్ నియోజకవర్గంలో రూ.470 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నమస్తే ఉప్పల్ కార్యక్రమంలో భాగంగా చిలకనగర్ డివిజన్లో పలువురు పార్టీ నేతలు కలిసి ఆయన పర్యటించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగున్నర సంవత్సరాలకాలంలో రూ. 470కోట్లతో వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, రూ. 24 కోట్లతో ఉప్పల్ స్కై వాక్ నిర్మాణం, ఉప్పల్ బాగాయత్ లేఔట్, శిల్పారామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం తదితర పనులు చేపట్టినట్లు తెలిపారు. గత పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి పనులకు ఇప్పటికీ తేడా గమనించాలని సూచించారు. రూ.200 కోట్లతో జలమండలి సహకారంతో కొత్త పైప్‌లైన్ల పనులు, రూ.10 కోట్లతో రామంతపూర్‌లో వరద ముంపులేకుండా నాలా పనులు చేపట్టామని, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో పసలేదని పేర్కొన్నారు. 6 రోజులుగా చేపట్టిన పాదయాత్ర కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగరావు, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, గుడి మధుసూదన్‌రెడ్డి, జల్లి మోహన్, పిట్టల నరేష్ ముదిరాజ్, వి.బి.నర్సింహ, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితోనే అభివృద్ధి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


కిషన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్‌పేట, జూలై 10 ప్రభాతవార్త:** బిజెపితోనే అభివృద్ధి సాధ్యమని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. తెలంగాణ బిజెపి నూతన అధ్యక్షుడిగా నియమితులైన జి.కిషన్‌రెడ్డిని బిజెపి కార్యాలయంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి నాయకులు, కార్యకర్తలతో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేటర్‌లో బిజెపిని మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రధాని మోడి సారధ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు గౌర దేవేందర్, యాదగిరి సురేందర్, కొప్పుల దినేష్, సంతోష్, ప్రభు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల ఏర్పాటు బీజేపీతోనే సాధ్యం


కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూలై 10 ప్రభాతవార్త:** హబ్సిగూడ హయత్‌నగర్ డివిజన్‌లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో భాగంగా కమలానగర్ కాలనీలో పాద యాత్ర నిర్వహించి... కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తూ కార్పొరేటర్ నవ జీవన్ రెడ్డితో కలిసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీసీల్లో కుల వృత్తులు చేసుకుని జీవించే వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీసీలు పెదవి విరుస్తున్నారన్నారు. దళితబంధు మాదిరిగా బీసీ బంధు కూడా దగా బంధు అవుతుందేమోనని ప్రజలు భావిస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో మాత్రం బిఆర్ఎస్ నేతల పేర్లు పెడుతున్నారని సమాచారమన్నారు. తెలంగాణాలో బిఆర్ఎస్‌కి ప్రత్యామ్నాయంగా బీజేపీ ఉందని బీజేపీ పై ప్రజాదరణ తగ్గించేందుకే కెసిఆర్ ఢిల్లీలో విషప్రచారం చేస్తున్నారన్నారు. 2014లో సరైన విధానాలు లేకుండా 58,59,జి.ఓ తీసుకువచ్చారు. జీఓ వచ్చిన కాన్నుండి బీఆర్ఎస్ నాయకులకు తప్ప జనాలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. 59 జి.ఓ పేరిట లక్షలాది రూపాయలు పేదవారి నుండి రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తుందన్నారు. అర్హులైనవారికి పింఛన్లు, డబల్ బెడ్ రూంలు, కొత్తగా వచ్చిన గృహలక్ష్మి అందించే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. తెలంగాణాలో అభివృద్ధి సంక్షేమ పథకాలు రావాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎల్లప్ప, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, పార్వతి వెంకన్న, సుజాతరెడ్డి, కుమార్, విష్ణు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్ బాబుకు సత్కారం

**ఎల్.బి.నగర్, జూలై 10 ప్రభాతవార్త :** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, మంథని నియోజకవర్గం ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛని అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ త్వరలో అధికారాన్ని అష్టగతం చేసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ చైర్మన్ మల్లాది పవన్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి యోగేష్ రెడ్డి, ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, గట్ల రవీంద్ర, కల్యాణ్ యాదవ్, ఏవి రావు, సత్తి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌స్పెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల సత్కారం


ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న ఉపేందర్‌రెడ్డి, గణేష్ నేత

**ఎల్.బి.నగర్, జూలై 10 ప్రభాతవార్త :** చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగర్జునను సోమవారం ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత ఆధ్వర్యంలో నాగార్జునను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్ల రవీంద్ర, రమేష్‌నేత, బొద్దుపల్లి మహేందర్, పగడాల శ్రీశైలం, కళ్యాణ్‌యాదవ్, ప్రేమ్ నాయక్, సలీం, పాండు, అనుదీప్, సల్లంగి శ్రీనివాస్, హరి, విప్లవ్‌రెడ్డి, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్, పింటూ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 59 జివో కింది దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు అవగాహన సదస్సు : తహసీల్దార్ వెంకటేశ్వర్లు..


సదస్సులో లబ్దిదారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లు

**నేరెడ్‌మెట్ జూలై10 ప్రభాతవార్త:** జీవో నెం 59 ద్వారా డిమాండ్ నోటీసులు అందిన లబ్దిదారులు ప్రభుత్వానికి డబ్బులుచెల్లించకుంటే నిర్మాణాలను కూల్చివేతలు చేయాల్సి వస్తుందని మల్కాజిగిరి తహశీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మల్కాజిగిరి తహశీల్దార్ కార్యాలయంలో 59జివో కింద దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 59 జీవో ద్వారా డిమాండ్ నోటీసులు అందిన ప్రతి ఒక్కరు ప్రభుత్వానికి డబ్బు కట్టి తమ ఇంటి స్థలాలను క్రమబద్దీకరణ చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో అట్టి నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. లబ్దిదారులు మాట్లాడుతూ 59 జీవో నిబంధన మేరకు కాకుండా అధికంగా డబ్బులు చెల్లించాలంటూ తమకు నోటీసులు అందినట్లు ఎమ్మార్వో విన్నవించారు.

**రాఘవేంద్రనగర్ కాలనీ వాసుల గగ్గోలు...** 59జీవో కింద 200 గజాల స్థలాన్ని క్రమబద్దీకరణకోసం దరఖాస్తు చేసుకోగా 15లక్షల రూపాయలు చెల్లించాలంటూ అధికారులు నోటీసులు జారీ చేయడం జరిగిందని ఓ లబ్దిదారుడు తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చాడు. అదే కాలనీలో అట్టి స్థలం పక్కన ఉన్న 217గజాల స్థలానికి రూ. 42లక్షలు చెల్లించాలంటూ నోటీసులు అందాయని బాధితులు ఎమ్మార్వోకు వివరిస్తూ గగ్గోలు పెట్టుకున్నారు.

**నోటీపై స్లమ్ముల్లో సైతం అధికంగా రుసుము...** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని అందే కాలనీ వీకర్ సెక్షన్ కింద ఉన్నప్పటికి అక్కడ 80 నుడి 100 గజాల్లో ఇంటి నిర్మాణం చేసుకొని నివాసం ఉంటున్న వారికి కూడా 10 నుండి 15లక్షల రూపాయలు చెల్లించాలంటూ నోటీసులు అందాయని వారు తహశీల్దార్‌కు తెలిపారు. ఇళ్ళల్లో పాచిపని చేసుకొని జీవనం సాగించే తాము లక్షల రూపాయలు ఎక్కడి నుండి తేవాలని వారు ఆవేదన వ్యక్తం చేసారు. కాలనీలోని నోటీపై స్లమ్ములను గుర్తించి వాటి ధరలను నిర్ణయించాలని వారు తహశీల్దార్‌ను కోరారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి


కాలనీలో పర్యటిస్తున్న శ్రీవాణి అంజన్ కుమార్ తదితరులు

**ఎల్.బి.నగర్, జూలై 10 ప్రభాతవార్త :** కాలనీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ కు వినతిపత్రం అందజేశారు. సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలోని డ్రైనేజ్ సమస్యల గురించి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు సోమవారం కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, జలమండలి మేనేజర్ పవిత్ర దృష్టికి తీసుకువెళ్లగా వారు కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. సమస్యలపై పరిశీలించిన కార్పొరేటర్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకుల అంజన్‌కుమార్, కాలనీవాసులు సరిత, నరేష్, దయాకర్, సూర్యనారాయణ, చంద్రయ్య, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సూరజ్‌నగర్ అసోషియేషన్ కమిటీ ఏర్పాటు

**తుర్కయాంజాల్, జూలై 10 ప్రభాతవార్త :** తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని సూరజ్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటినీ కొండూరి వెంకటేష్,కాసాని తిరుపతయ్యగౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసుల సమక్షంలో నియామకం జరిగింది. నూతన కమిటి సభ్యులుగా అధ్యక్షులు చల్లా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా చెక్క ధన్‌రాజ్, యాట శంకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా కమటం చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా విఆర్‌బి రెడ్డి, డి.పర్వతాలు, మల్లేష్ యాదవ్, కోశాధికారిగా నాచం రమేశ్‌గుప్త, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వలిగె వెంకటేశ్, రమావత్ లక్ష్మినాయక్, ఆడిట్ సభ్యులుగా రామానుజబాబు. వెంకటేశ్వర్, కమిటీ సభ్యులుగా సురేందర్‌రెడ్డి, సిద్దగాని యాదయ్యగౌడ్, బాలు, రాజు, విజయ్‌కుమార్, శంకర్‌రావు, కొండూరి వెంకటేశ్, కర్నాటి రఘుమారెడ్డి, జాన్నాడ సుదర్శన్‌రెడ్డి, కాసాని తిరుపతయ్యగౌడ్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## హబ్సిగూడలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, జూలై 10 ప్రభాతవార్త:** హబ్సిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా వివిధ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎన్.రామ్‌రెడ్డి తెలిపారు. హబ్సిగూడ స్నేహపురి కాలనీ ఫీడర్ పరిధిలోని స్నేహపురి కాలనీ వీఎస్టీకాలనీ భవానినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా హబ్సిగూడ గ్రీన్ హిల్స్ కాలనీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం మూడు గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## హెచ్‌ఎంటీనగర్ పటేల్‌కుంట చెరువుల అభివృద్ధి చేయాలని కార్పోరేటర్ వినతి


ఎస్ఈ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతిశేఖర్

**నాచారం, జూలై 10 ప్రభాతవార్త:** హెచ్‌ఎంటీనగర్, పటేల్‌కుంట చెరువులను అభివృద్ధి చేయాలని కోరుతూ ఇరిగేషన్ ఎస్ఈ ఆనంద్‌కు సోమవారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ వినతి పత్రాన్ని అందజేశారు. హెచ్ఎంటీనగర్ పెద్ద చెరువు ఎస్‌టీపీ ప్రక్కన బతుకమ్మ పాండ్ నిర్మించాలని, వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు, బిహారీలు జరుపుకునే ఛట్ పూజలకు ఉపయోగపడేలా కుంటను నిర్మించాలని కార్పొరేటర్‌ను కోరారు. అదేవిదంగా రూ. కోటి 80లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పటేల్‌కుంట చెరువు వద్ద నిర్మిస్తున్న డైవర్షన్ పనులను అసంపూర్తిగా ఉంచారని దానిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగిషన్ ఏఈ నాగరాజు, నాయకులు సాయిజన్ శేకర్ తధితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు

**నాచారం, జూలై 10 ప్రభాతవార్త:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మర్రిగూడ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు స్థానికంగా ఉన్న స్మశాన వాటికలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. స్మశాన వాటికలో స్నానాల గదులు, దింపుడు గల్లె దిమ్మె, నీటి వసతి, లైట్లు, గార్డెన్, సిమెంట్ బెంచులు వంటి వాటిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రతినిధులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అల్లూరి రాజిరెడ్డి, సభ్యులు వంగేటి బాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, నర్సింహ్మా, శ్రీధర్‌రెడ్డి, వంగేటి సతీష్‌రెడ్డి, నల్ల బాల్‌రెడ్డి, సిహెచ్.లక్ష్మణ్, వి.బాల్‌రెడ్డి, అల్లూరి హరికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.